సాక్షి అన్నమయ్య జిల్లా

సోమవారం । 30 । డిసెంబర్ । 2024



రె'ఢీ' అంటున్నారు.!

గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి బరికి సై అంటూ పందెంకోళ్లు కాలు దువ్వుతున్నాయి. పండుగ దగ్గర పడినకొద్దీ సమరోత్సాహంతో కదం తొక్కుతున్నాయి.

-8లో



చెట్టును ఢీకొన్న కారు

కారు అదుపుతప్పి చెట్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన మదనపల్లె బైపాస్‌లో జరిగింది.

-8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.190	రూ.240
రెండోరకం	రూ.110	రూ.180



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 99 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	500	555
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 190.940 కిలోలు

న్యూస్‌రీల్

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

రాయచోటి: ప్రజల నుంచి సమస్యలు స్వీకరించి వాటిని పరిష్కరించేందుకు ఈనెల 30వ తేదీ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటితోపాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

గంగమ్మా..కరుణించవమ్మా..



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

లక్కిరెడ్డిపల్లి: మండల పరిధిలోని అనంతపురం గ్రామంలో వెలసిన గంగమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. గంగమ్మా..కరుణించవమ్మా అంటూ వేడుకున్నారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీనివాసులు, చైర్మన్ సిద్దయ్య, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఒంటిమిట్టకు టీడీడీ జేఈఓ

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయానికి టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం సోమవారం రానున్నారు. ఈ విషయాన్ని ఒంటిమిట్ట ఆలయ టీటీడీ అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కల్యాణ వేదిక వద్ద అసంపూర్తిగా ఉన్న హైలెవల్ నీటి ట్యాంకును పరిశీలిస్తారన్నారు. నూతన సంవత్సరం, వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఒంటిమిట్ట రామాలయానికి విచ్చేసే భక్తులకు ఏర్పాటు చేయాల్సిన మౌళిక వసతులపై సంబంధిత అధికారులతో చర్చించనున్నారని వారు తెలిపారు.

ఒంటిమిట్ట ఆలయంలో కియోస్క్ ఏర్పాటు



కియోస్క్ మిషన్

ఒంటిమిట్ట: ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయం ఎదురుగా తిరుమల-తిరుపతి దేవస్థానం(టీటీడీ) వారు ఉచిత అన్న ప్రసాద కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రం వద్ద కియోస్క్ మిషన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. దీనిద్వారా భక్తులు అన్నప్రసాద కేంద్రానికి సులభతరంగా విరాళం అందిచవచ్చు. కియోస్క్ మిషన్ లోని క్యూ ఆర్ కోడ్ ను స్కాన్ చేసి యూపీఐ ద్వారా విరాళం ఇవ్వవచ్చు. కియోస్క్‌ను 15రోజుల కిందట ఏర్పాటు చేశారు. ఇప్పటివరకు రూ.లక్షల్లో విరాళం వచ్చినట్లు తెలుస్తోంది.


సొరంగ మార్గం నిర్మాణ ప్రాంతం పరిశీలన



గువ్వలచెరువు ఘాట్‌ను పరిశీలిస్తున్న ఢిల్లీ చీఫ్ ఇంజినీర్ రాహుల్ గుప్తా

రామాపురం: కర్నూలు – చిత్తూరు 40వ జాతీయ రహదారిలో భాగమైన గువ్వలచెరువు ఘాట్ రోడ్డు సొరంగ మార్గం నిర్మాణం ప్రాంతాన్ని కేంద్ర చీఫ్ ఇంజినీర్ రాహుల్‌గుప్తా పరిశీలించారు. ఆదివారం స్థానిక ఎన్‌హెచ్ అధికారులతో కలిసి గువ్వల చెరువు ఘాట్ రోడ్డు ప్రాంతాలను ఆయన పరిశీలించారు. జాతీయ రహదారిలో భారీ వాహనాల రవాణాకు ఘాట్ రోడ్డు కష్టతరంగా ఉండడంతో ఆరు కిలోమీటర్ల మేర సొరంగ మార్గం నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమతి ఇస్తూ నిధులను మంజూరు చేసిందని చీఫ్ ఇంజినీరు తెలిపారు. ఘాట్‌రోడ్డు ప్రయాణంలో వాహనాలు లోయలో పడి ప్రమాదాలకు గురై అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. కార్యక్రమంలో విజయవాడ రీజనల్ అధికారి లోకేష్ కుమార్, సూపరింటెండెంట్ ఇంజినీర్ హరిప్రసాద్, ఈఈ భాస్కర్ రెడ్డి, విశ్వనాథ పాల్గొన్నారు.

పరీక్షా కాలం.. ప్రణాళిక ముఖ్యం



పరీక్షలకు సిద్ధమవుతున్న పదో తరగతి విద్యార్థులు

- మార్చి 17 నుంచి పది పరీక్షలు
- మార్చి 3 నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు
- రేయింబవళ్లు పుస్తకాలతో బిజీబిజీ
- ఒత్తిడి జయించాలంటున్న నిపుణులు

మదనపల్లె సిటీ: పరీక్షలు వస్తున్నాయంటే విద్యార్థులు, తల్లిదండ్రుల్లో ఆందోళన మొదలవుతుంది. చదవాల్సిన బండెడు సిలబస్, తోటివారు బాగా చదివేస్తున్నారేమోననే ఆలోచనలు పిల్లల్లో మొదలవుతుంటాయి. మంచి మార్కులు తెచ్చుకుంటేనే ఉజ్వల భవిష్యత్తు అని తల్లిదండ్రుల హెచ్చరికలు, చిన్న మనసులపై ఒత్తిడి పెంచుతాయి. పదోతరగతి, ఇంటర్‌బోర్డు పరీక్షల షెడ్యూలు ఇప్పటికే వెలువడింది. ఇంటర్మీడియట్ మార్చి 3 నుంచి, పదో తరగతి మార్చి 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రత్యేక కథనం.



పదో తరగతి విద్యార్థులు: **23,311** మంది

ఇంటర్మీడియట్ విద్యార్థులు:

మొదటి సంవత్సరం: **15,356** మంది

ద్వితీయ సంవత్సరం: **14,248** మంది

పట్టు సాధించేందుకు..

పరీక్షలు అందరికీ ఒక్కటే అయినా ఒక్కొక్కరు ఒక్కోలా ఎదుర్కొంటారు. ఎప్పటి పాఠాలు అప్పుడు చదివిన వారికి ఏ ఆందోళనా ఉండదు. ఏడాదంతా ఆడుతూ పాడుతూ పరీక్షల సమయ మొచ్చాక ఇన్ని సబ్జెక్టులు చదవటం, ఎప్పటికి పూర్త వుతుందోనని కంగారుపడేవారికి సమయపాలన అవసరమని గుర్తించాలి.

- రోజూ చదవటానికి నిర్దిష్ట సమయం కేటాయించాలి.
- పునశ్చరణ తప్పనిసరి
- ఒత్తిడి, భయం ఉన్నప్పుడే కుటుంబసభ్యులు, స్నేహితులతో మాట్లాడండి. మానసిక ఆరోగ్యం కోసం సన్నిహితుల మద్దతు అవసరం.
- పరీక్షల ముందే అన్ని సబ్జెక్టులు చదివేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.
- ఏకధాటిగా చదవటం కంటే ప్రతి గంటకు 5-10 నిమిషాలు విరామం తీసుకోవడం మంచిది. ఎక్కువ టెస్టు పేపర్స్ సాధన చేస్తే స్వీయ విశ్వాసం పెరుగుతుంది.
- సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకోవాలి. స్నేహితులు బృందంగా ఏర్పడి చర్చిస్తే సబ్జెక్టుపై పట్టు పెరుగుతుంది.
- సిలబస్‌లోని ముఖ్యాంశాలు, ప్రశ్నల సరళి, మార్కుల కేటాయింపుపై దృష్టి సారించాలి. గత ప్రశ్నపత్రాలను పరిశీలించాలి.

ఆరోగ్యమూ కీలకమే

పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటే మెరుగైన ఫలితాలు వస్తాయని నిపుణులు చెబుతున్నారు.



- శక్తి, ఏకాగ్రత కోసం ప్రోటీన్లు, పండ్లు, కూరగాయలు, చిరుధాన్యాలతో కూడిన పోషకాహారం తీసుకోవాలి. జంక్ ఫుడ్, అధిక మసాలాలు కలిగిన ఆహారానికి దూరంగా ఉండాలి. నీటిని సరిపడా తాగాలి.రోజుకు కనీసం 6-8 గంటల నిద్ర అవసరం. నిద్రలేమితో ఏకాగ్రత, జ్ఞాపకశక్తి మందగిస్తుంది.

వ్యాయామంతో చురకుదనం



పరీక్షల సమయంలో వ్యాయామాలు చేయటం ద్వారా ఎండార్ఫిన్ అనే హార్మోన్ విడుదలవుతుంది. ఇది మానసిక ప్రశాంతతను కలిగిస్తుంది. వ్యాయామంతో హిప్పో కాంపస్ అనే మెదడు భాగం ఉత్తేజితమవుతుంది. తద్వారా జ్ఞాపకశక్తి పెరుగుతుంది.

- రోజూ ఉదయం, సాయంత్రం ప్రాణాయామం చేయటం వలన మెదడుకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది. కనీసం 1-15 నిమిషాల నడక వల్ల రక్తప్రసరణ మెరుగుపడి మెదడు చురుగ్గా పని చేస్తుంది. వ్యాయామం చేసిన తర్వాత మంచినీళ్లు తాగటం మరిచిపోవద్దు.

ఆందోళన చెందకూడదు



విద్యార్థులు పరీక్ష ఫలితాలపై ఆందోళన చెందకుండా ప్రయత్నంపై దృష్టి సారించాలి. పరీక్షల్లో ఎక్కువ మార్కులు వచ్చే అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలి. గణితం, సైన్సు వంటి సబ్జెక్టుల్లోని సూత్రాలను క్రమం తప్పకుండా వల్లె వేస్తూ ఉండాలి. ప్రతి ప్రశ్నను శ్రద్ధగా చదివి అర్థం చేసుకున్నాకే సమాధానం రాయలి.

–సుబ్బారెడ్డి, హెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్, మదనపల్లె

పరీక్షలు జీవితాన్ని నిర్ణయించవు



పరీక్షలు జీవతంలో భాగమే అయినా పూర్తి జీవితాన్ని నిర్ణయించవు. విద్యార్థులు ఒత్తిడికి గురైనప్పుడు గతంలో సాధించిన విజయాలను గుర్తు చేసుకోవాలి. అవి తదుపరి అడుగులకు ప్రేరణగా నిలుస్తాయి.

–చాముండేశ్వరి, సైకాలజిస్టు, మదనపల్లె

వచ్చేనెల 3నుంచి ఉరుసు మహోత్సవం



మాచుపల్లె గ్రామ సమీపంలోని హజరత్ సయ్యద్ షావలి దర్గా

సిద్దవటం: మండలంలోని మాచుపల్లె గ్రామ సమీపంలో ఉన్న హజరత్ సయ్యద్ షావలి దర్గాలో జనవరి 3వ తేదీ నుంచి ఉరుసు మహోత్సవం జరగనుంది. ఈ విషయాన్ని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ తెలిపారు.ఆదివారం ఇక్కడ ఆయన మాట్లడుతూ మాచుపల్లె గ్రామ సమీపంలో వెలసిన హజరత్ సయ్యద్ షావలి దర్గా పురాతన మైందని తెలిపారు. జనవరి 3న రాత్రి 9 గంటలకు గంధం మహోత్సవాన్ని పూల చాందినీలో ఊరేగిస్తారన్నారు.తర్వాత ఫాతేహా నిర్వహిస్తారన్నారు. 4న రాత్రి ఉరుసు జరుగుతుందని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం, రాత్రి వేళల్లో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు నారపురెడ్డి శ్రీనివాసులరెడ్డి అధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఉంటుందని చెప్పారు.రాత్రి బెంగళూరుకు చెందిన జమీర్ షహజాదా ఖవ్వాలీ, హైదరాబాద్‌కు చెందిన రబియాతాజ్ ఖవ్వాలి బృందాల మధ్య ఖవ్వాలి పోటీ ఉంటుందని తెలిపారు. 5న ఉదయం తహలీల్ ఫాతేహా జరుగుతుందన్నారు. అందరూ ఉరుసు మహోత్సవంలో పాల్గొని జయప్రదం చేయాలని దర్గా కమిటీ ముజావర్ సయ్యద్ సలావుద్దీన్ కోరారు.

ఏఆర్ కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప అర్బన్: జిల్లాలో ఏఆర్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న గురునాథ్‌ను సస్పెండ్ చేస్తూ వైఎస్ఆర్ జిల్లా ఇన్‌చార్జి ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కానిస్టేబుల్‌గా వున్న ఈయన ఎస్‌ఐ అని చెప్పు కొంటూ ఇతరులను బెదిరించడం, సక్రమంగా విధులు నిర్వర్తించకుండా ఉండటంతో ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. వారు అందించిన నివేదిక ప్రకారం అతనిపై ఎస్పీ వేటు వేశారు.

రైతు కుటుంబం ఆత్మహత్య పట్టదా?

- ప్రభుత్వం బాధ్యత వహించాలి
- పౌర హక్కుల సంఘం నాయకులు



మృతుల బంధువుతో మాట్లాడుతున్న పౌర హక్కుల సంఘం నాయకులు

సింహాద్రిపురం: రైతు కుటుంబం ఆత్మహత్యపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. సింహాద్రిపురం మండలం దిద్దికుంట గ్రామంలోని రైతు కొమెర నాగేంద్ర, శ్రీవాణి, వారి పిల్లల ఆత్మహత్యపై పౌర హక్కుల సంఘం జిల్లా కమిటీ నిజ నిర్ధారణ చేపట్టింది. దిద్దికుంట గ్రామానికి ఆదివారం వెళ్లి మృతుల బంధువులతో మాట్లాడింది. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కమిటీ నాయకులు వాస్తవ విషయాలు వెల్లడించారు. నాగేంద్ర శుక్రవారం రాత్రి పొలం వద్ద మొదట భార్య, తర్వాత పిల్లలకు ఉరి వేశారని, అనంతరం అతను కూడా ఉరి వేసుకుని బలవన్మరణం పొందారని తెలిపారు. అప్పులే వారి ఉసురు తీశాయని పేర్కొన్నారు. నాగేంద్ర తనకు ఉన్న ఒకటిన్నర ఎకరా పొలంతోపాటు 13 ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేశారని తెలిపారు. ఆరేడు ఏళ్ల నుంచి పంట పెట్టుబడుల కోసం రూ.30 లక్షలు పైగా అప్పు చేశాడన్నారు. దిగుబడి రాకపోవడంతో అప్పులు పెరిగిపోయాయని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రుణదాతలు ఒత్తిడి చేయడం.. అప్పుల నుంచి బయటపడే మార్గం కనిపించకపోవడంతో కుటుంబం మొత్తం ఆత్మహత్య చేసుకుందన్నారు. వ్యవసాయాన్ని నమ్ముకొని ఆరుగాలం కష్టపడి పని చేసిన రైతు కుటుంబం బలవన్మరణం పొందడం బాధాకరమన్నారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం ఉమ్మడి కడప జిల్లా కార్యదర్శి రాయచోటి రవిశంకర్, ఉపాధ్యక్షుడు పి.రెడ్డయ్య, సహాయ కార్యదర్శి ఎం.రవిశంకర్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ దేహదారుఢ్య పరీక్షలపై ట్రయల్ రన్

కడప అర్బన్: వైఎస్సార్ జిల్లా కడపలోని డీటీసీ (జిల్లా పోలీస్ శిక్షణా కేంద్రం) మైదానంలో సోమవారం నుంచి కానిస్టేబుల్ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నేపథ్యంలో విధుల్లో పాల్గొనే పోలీసు అధికారులు, సిబ్బంది కొంత మంది యువకులతో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాష్ బాబు ఆదివారం ట్రయల్‌రన్ (రిహార్సల్) నిర్వహించారు. అదే విధంగా డీటీసీ మైదానంలో పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశమై పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎలా విధులు చేపట్టాలో దిశానిర్దేశం చేశా రు. పోలీసు నియామక ప్రక్రియలో భాగంగా కానిస్టేబుల్ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు సోమవారం నుంచి జన వరి 8 వరకు దేహదారుఢ్య (పీఎంటీ, పీఈటీ) పరీక్షలు జరగనున్నాయి. ఇందుకోసం చేసిన ఏర్పాట్లపై అదనపు ఎస్పీ ఆరా తీసి పరిశీలన చేశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఆర్ఎఫ్ఐడీ సాంకేతిక పరిజ్ఞానంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సూచించారు. జిల్లా అదనపు ఎస్పీ (ఏ.ఆర్) బి.రమణయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా పరుగు పోటీలు

ప్రొద్దుటూరు కల్చరల్: స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని టీవీఆర్ హైస్కూల్ సమీపంలో ఆదివారం జిల్లా స్థాయి క్రాస్ కంట్రీ (దూరపు పరుగు) పోటీలు ఉత్సాహంగా సాగాయి. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 70 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. 16 ఏళ్లలోపు బాలుర 2 కిలోమీటర్ల విభాగంలో చంద్ర ఓబుళరెడ్డి, నజీర్, బాలికల విభాగంలో షేక్‌ఫాతిమా నస్రీన్, ప్రసన్న, 18 ఏళ్లలోపు బాలుర 6 కిలో మీటర్ల విభాగంలో ముని నరేంద్ర, తేజేష్, బాలికల 4 కిలో మీటర్ల విభాగంలో షేక్ ముబీనా, 20 ఏళ్లలోపు బాలుర 8 కిలో మీటర్ల విభాగంలో దేవేంద్ర, గంగాధర్, చిన్నవీరేష్, పురుషుల 10 కిలోమీటర్ల విభాగంలో హేమకిరణ్ నాయక్, శ్రీహరి ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరు జనవరి 5న పశ్చిమగోదావరి జిల్లా తణుకులో నిర్వహించే రాష్ట్రస్థాయి క్రాస్‌కంట్రీ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరపున పాల్గొననున్నారు. పోటీలను బాషా అథ్లెటిక్ ఫౌండేషన్ కార్యదర్శి వై.అహ్మర్‌బాషా, వ్యాయామ సంచాలకులు వెంకట సుబ్బయ్య, లక్ష్మీదేవి, చరణ్‌కుమార్‌రెడ్డి, నాగేశ్వరరావు, సంజీవ్, దిలీప్, ఖాదర్‌రెడ్డి, సీనియర్ క్రీడాకారుడు రబ్బాని పర్యవేక్షించారు.



పరుగు పోటీలో పాల్గొన్న క్రీడాకారులు

రాయలసీమపై వివక్ష తగదు



సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీలు, సంస్థల, ప్రజా సంఘాల నాయకులు

- ఏపీజీబీ ప్రధాన కార్యాలయం తరలింపు వద్దు
- రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజా సంఘాల ప్రతినిధులు

కడప కల్చరల్: రాయలసీమపై కూటమి ప్రభుత్వం వివక్ష చూపించడం తగదని ప్రజాసంఘాల ప్రతినిధులు అన్నారు. రాయలసీమ అభివృద్ధి వేదిక కన్వీనర్ డాక్టర్ సి.ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథ్‌రెడ్డి అధ్యక్షతన స్థానిక ఆర్ అండ్‌బీ బంగ్లాలో ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున ప్రజా సంఘాల ప్రతినిధులు హాజరై తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు హరికిషోర్‌రెడ్డి, అరసం అధ్యక్షుడు ఆచార్య ఈశ్వర్‌రెడ్డి, ప్రైవేటు విద్యాసంస్థల సంఘం నేత జోగి రామిరెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ బాలిరెడ్డి, భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా నేత జనార్దన్‌రెడ్డి మాట్లాడారు. ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ప్రధాన కార్యాలయాన్ని మరో మూడు బ్యాంకుల విలీనం తర్వాత అమరావతికి తరలించాలన్న ప్రయత్నం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజలకు ఏదైనా మేలు చేయకపోగా ఉన్న ప్రధాన కార్యాలయాలను అమరావతికి తరలిస్తామని చెప్పడం.. సీమ పట్ల వివక్ష చూపడమేనన్నారు. ఇప్పటికే లోకాయుక్త, ఎంఎస్‌ఎంఈ ట్రైనింగ్ సెంటర్, న్యాయ విశ్వవిద్యాలయం, హైకోర్టు, నార్కోటిక్స్ కోర్టులను రాయలసీమకు లేకుండా చేశారని, రాష్ట్రమంటే అమరావతి మినహా మరొకటి లేదనట్లు ప్రవర్తించడం సరికాదన్నారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు, సంప్రదాయం ప్రకారం కడపలోనే ఏపీజీబీ హెడ్ క్వార్టర్‌ను కొనసాగించాలని, లేనిపక్షంలో రాజకీయాలకతీతంగా అన్ని పక్షాలను, సంఘాలను, తరగతులను సమీకరించి పోరాటం చేస్తామని హెచ్చరించారు. త్వరలోనే జిల్లా స్థాయిలో వెనుకబడిన ప్రాంతాల శ్రేయస్సు కోరుకునే సకల జనుల సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వివిధ పార్టీలు, ప్రజా సంఘాలు, వివిధ రంగాల ప్రముఖులు గాలి చంద్ర, జి.చంద్రశేఖర్, రవి శంకర్‌రెడ్డి, ఎస్ ఏ సత్తార్, సునీల్ కుమార్, రచయిత పాలగిరి విశ్వ ప్రసాద్‌రెడ్డి, డెంటల్ డాక్టర్స్ అసోసియేషన్ నాయకుడు డీవీకే కుమార్, కార్మిక సంఘాల ప్రతినిధులు కామనూరు శ్రీనివాసరెడ్డి, సుబ్బిరెడ్డి, శివ శంకర్, రామాంజనేయులు, రాజమణి, ప్రసాద్, కాంగ్రెస్ ప్రతినిధి మైనుద్దీన్, ఎల్ఐసీ సంఘాల ప్రతినిధులు శంకర్రావు, శ్రీనివాస్, నిత్యానందరెడ్డి, కస్తూరి, బ్యాంకు సంఘాల ప్రతినిధులు అబ్దుల్ అజీజ్, జగదీష్, ప్రసన్న, శివశంకర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు లక్ష్మీ రాజా, మహేష్, శ్రీనివాస్, జెవివి ప్రతినిధులు రాహుల్, వెంకటసుబ్బయ్య, నరసింహారెడ్డి, రాజు, బుద్దిస్ట్ సొసైటీ ప్రతినిధులు కుమారస్వామి, భాస్కర్ పాల్గొన్నారు.

కేంద్రం కరుణించేనా!

- జనవరి ఒకటిన హార్సిలీహిల్స్‌కు కేంద్ర బృందం రాక
- పంట నష్టాలు, కరువు పరిస్థితుల పరిశీలన
- వర్షాభావంతో 40,990 హెక్టార్ల భూమి బీడు
- కరువు జాబితాలో 19 మండలాలు



కలకడలో ఎండిపోయిన వేరుశెనగ (ఫైల్)

బి.కొత్తకోట: 2024 ఖరీఫ్‌లో నెలకొన్న కరువు పరిస్థితులు, పంటలను నష్టపోయిన రైతాంగం పరిస్థితులను పరిశీలించేందుకు కేంద్ర కరువు బృందం జనవరి ఒకటిన జిల్లాకు వస్తోంది. బెంగళూరు విమానాశ్రయం నుంచి బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్ చేరుకునే బృందం రాత్రికి ఇక్కడ బస చేసి మరుసటి రోజు తంబళ్లపల్లె, మదనపల్లె నియోజక వర్గాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలోని 30 మండలాల్లో 19 మండలాలు కరువు బారిన పడ్డాయి.గత ఖరీఫ్‌లో 65,386 హెక్టార్లలో అన్ని రకాల పంటలు సాగవ్వాల్సి ఉండగా వర్షాలు కురవకపోవడంతో కేవలం 37.31 శాతం విస్తీర్ణంలోనే పంటలు సాగు చేశారు. అత్యధికంగా వేరుశనగ 42,852 హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా 13,390 హెక్టార్లకే పరిమితమైంది. 29,462 హెక్టార్లలో వేరుశనగ సాగుకు నోచుకోలేదు. మొత్తం 65,386 హెక్టార్లలో పంటలు సాగు కావాలి, అయితే వర్షాభావంతో 24,396 హెక్టార్లలోనే సాగయ్యాయి. సాగులో 40,990 హెక్టార్ల భూమి బీడుగా మిగిలిపోయింది.

12,723 హెక్టార్లలో నష్టం: జిల్లాలో వేరుశనగ అత్యధికంగా సాగైంది. సాగైన పంటల్లో 12,723 హెక్టార్లలో పంట పూర్తిగా దెబ్బతింది. సకాలంలో వర్షం కురవకపోవడంతో సాగుచేసిన పంటలు ఎండిపోయాయి. దీనివల్ల వేరుశనగ సాగు చేసిన 23,987 మంది రైతులు పంట పెట్టుబడులను నష్టపోయారు. దీనిపై వ్యవసాయశాఖ జిల్లా అధికారి చంద్రానాయక్ పంటల పరిశీలన పూర్తి చేసి నష్టపోయిన రైతాంగాన్ని పంట పరిహారం చెల్లించడం కోసం రూ.21.5 కోట్లు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.

కేంద్రంపై ఆశలు: కరువు పరిస్థితులతో అల్లాడిపోతున్న తమను ఆదుకునేందుకు కేంద్రం చొరవ చూపాలని రైతాంగం కోరుతోంది. పంటనష్టంపై ప్రభుత్వం ఇంతవరకు స్పందించలేదు. ప్రత్యామ్నాయ పంటల సాగు కోసం ఉలవలను పంపిణీ చేసిన ప్రభుత్వం కరువు కారణంగా కల్పించే వెసులుబాటు ఇంకా కలగలేదు. కేంద్ర బృందం ఇక్కడి పరిస్థితులను కేంద్రానికి నివేదించి ఆదుకునేలా చూస్తారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

19 మండలాల్లో కరువు

జిల్లాలోని చిన్నమండెం, సంబేపల్లె, టి.సుండుపల్లె, రాయచోటి, గాలివీడు, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లి, తంబళ్లపల్లె, ములకలచెరువు, కురబలకోట, పెద్దతిప్పసముద్రం, బి.కొత్తకోట, నిమ్మనపల్లె, పీలేరు, గుర్రంకొండ, కలకడ, కలికిరి, వాయల్పాడు మండలాలను ప్రభుత్వం కరువు మండలాలుగా ప్రకటించింది.

క్లుప్తంగా

నూనె యంత్రంలో పడి తెగిన చేయి



బి.కొత్తకోట : సెలవు కావడంతో తల్లిదండ్రులతో కలిసి ఆడుకుంటున్న బాలుడి చేయి నూనె యంత్రంలో పడటంతో తెగిపోయింది. ఈ సంఘటన ఆదివారం అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటలో జరిగింది. స్థానిక పోస్టాఫీసు వీధికి చెందిన నూరుల్లా, షాహినా దంపతుల కుమారుడు మహ్మద్ అయాన్ రెండోతరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులతో కలిసి బెంగళూరురోడ్డులోని నూనెగింజల ఫ్యాక్టరీకి వెళ్లాడు. అక్కడ ఆడుకుంటూ ప్రమాదవశాత్తు చేయి నూనె తీసే యంత్రంలో పడింది. దీంతో అయాన్ చెయి యంత్రంలో ఇరుక్కుని బెల్టు చుట్టూ తిరుగుతూ కుడిచేయి నలిగిపోయి మోచేయి వరకు తెగిపోయింది. అయాన్ భుజం, మెడపై తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనతో హతాశులైన తల్లిదండ్రులు తట్టుకోలేకపోయారు. 108లో ఆయాన్‌ను స్థానిక సీహెచ్‌సీకి తరలించి వైద్యం అందించారు. ఇక్కడి నుంచి మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. తెగిన చేయిని వెంట తీసుకెళ్లారు. తర్వాత బాలుడిని బెంగళూరు తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

చిన్నమండెం : కడప–బెంగళూరు జాతీయ రహదారి చిన్నమండెం మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు స్కూటరిస్టులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. రాయచోటి పట్టణం కొత్తపల్లెకు చెందిన ఫారూక్, ఉమర్, ఫారూక్‌లు చిన్నమండెం మండల కేంద్రంలోని తమ బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. చిన్నమండెం తహసీల్దార్ కార్యాలయం సమీపం వద్దకు రాగానే బోరు పైపులు లాగే ట్రాక్టర్ ఉన్నట్లుండి పక్కకు రావడంతో బైకు ఢీకొంది. ఈ సంఘటనలో గాయపడిన వారిని రాయచోటి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో ఒకరికి తీవ్ర గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేయాల్సి ఉంది.

కుక్క అడ్డు వచ్చి ద్విచక్ర వాహనదారుడికి గాయాలు



తీవ్రంగా గాయపడిన మేస్త్రీ నారాయణ

మదనపల్లె : ద్విచక్రవాహనానికి కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం పుంగనూరు మండలంలో జరిగింది. రామసముద్రం మండలం కొత్తూరుకు చెందిన భవన నిర్మాణ మేస్త్రీ నారాయణ(55) మదనపల్లెలో ఉన్న తన కుమార్తె ఇంటికి ద్విచక్రవాహనంలో వచ్చాడు. తిరిగి స్వగ్రామానికి వెళుతుండగా, మదనపల్లె–పుంగనూరు మార్గమధ్యంలోని ఈడిగపల్లె వద్ద అకస్మాత్తుగా కుక్క అడ్డు రావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కుడికాలు విరిగింది. గమనించిన స్థానికులు బాధితుడిని వెంటనే మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆస్పత్రికి రెఫర్ చేశారు.

రెడీ అంటున్నారు.!

- సమరానికి సై అంటున్న పందెంకోళ్లు
- ప్రత్యేక శిక్షణ.. బలవర్థక ఆహారం అందిస్తున్న కోడిపందెం నిర్వాహకులు



గ్రామీణ ప్రాంతాల్లో సంక్రాంతి బరికి సై అంటూ పందెం కోళ్లు కాలు దువ్వుతున్నాయి. పండుగ దగ్గర పడినకొద్దీ సమరోత్సాహంతో కదం తొక్కుతున్నాయి. పందెం కోళ్లకు డిమాండ్ పెరుగుతోంది. రహస్య ప్రాంతాల్లో కోడిపందేలు జరుగుతుంటాయి. ఈ ఏడాది కోడిపందాలు ఎలా జరుగుతాయనేది చర్చనీయాంశంగా మారింది.

రాజంపేట/రాజంపేట టౌన్ : తెలుగువారికి అతి పెద్ద పండుగ సంక్రాంతి. సంక్రాంతి సందర్భంగా వివిధ రకాల వినోదాలతో ప్రజలు పండుగను ఫుల్‌గా ఎంజాయ్ చేస్తారు. అందులో భాగమే కోడిపందేలు. చట్టరీత్యా కోడిపందేలు నేరం అయినప్పటికీ పందెం ప్రియులు మాత్రం పోలీసుల కన్నుగప్పి జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో పండుగ మూడు రోజులు కోడిపందేలు కాయడం అనాదిగా వస్తోంది. ఈ ఏడాది మరో రెండు వారాల్లో సంక్రాంతి పండుగ వేడుకలు ప్రారంభం కానుండటంతో పందెం నిర్వాహకులు కోళ్లను పందేనికి పూర్తిస్థాయిలో సిద్ధం చేస్తున్నారు. బరిలోకి దింపే కోళ్లపై గత కొన్ని నెలల నుంచి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ వస్తున్నారు. సంక్రాంతి పండుగ సమీపిస్తుండటంతో పందెం కాసేవాళ్లు నిద్ర లేచినప్పటి నుంచి పందెం కోళ్లపై మరింత శ్రద్ధ కనబరుస్తున్నారు. అందులో భాగంగా కోడిపుంజులకు ఈతకొట్టించి రెండు గంటల పాటు ఎండలో ఉంచుతున్నారు. ఇలా చేయడం వల్ల బరిలో పుంజు ఆయాసం లేకుండా పోరాడుతుందని వారి నమ్మకం. అలాగే వాకింగ్ కూడా చేయిస్తున్నారు.

ప్రారంభానికి ముహూర్తం

పందెం కాసేవాళ్లలోనే కొంత మంది కుక్కుటశాస్త్రం ద్వారా కోడిపుంజు జాతి, రంగు చూసి బరిలోకి దింపేందుకు ముహూర్తం నిర్ణయిస్తారు. అలాగే పందేనికి ఏ దిక్కున ఏ సమయంలో వెళితే బాగుంటుందన్న విషయాన్ని కూడా తెలుసుకుంటారు. ఇక తిథులనుబట్టి ఆరోజు అచ్చివచ్చే రంగులను వీరు అంచనా వేస్తారు. కొంతమంది పందెం కాసేవాళ్లు అచ్చివచ్చే రంగుల కోళ్ల మధ్యే పోటీ నిర్వహించేందుకు ఆసక్తి చూపుతారు.

గోదావరి జిల్లాలకు భిన్నంగా..

సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడిపందేలకు గోదావరి జిల్లాలు ప్రసిద్ధి. అక్కడ కోడి ఒకసారి బరిలోకి దిగితే ఏదో ఒక కోడి ఓడిపోయి చనిపోవడం కాని లేక లేవలేని స్థితిలో పడిపోయే వరకు వాటి వద్దకు వెళ్లరు. అయితే జిల్లాలో అందుకు భిన్నంగా పోరు సాగుతుంది. పోరుసాగే సమయంలో పందెంరాయుళ్లు మధ్యలో వెళ్లి తమ కోళ్లను బరినుంచి బయటకు తీసుకొస్తారు. తరువాత కొద్దిసేపటికి మళ్లీ బరిలోకి దింపుతారు.

పందేలు.. రకాలు

జిల్లాలో పందేలు రెండు రకాలుగా జరుగుతాయి. కొంతమంది ముందుగానే కోళ్లను చూసుకొని పందెం డబ్బులు మాట్లాడుకొని వారి కోళ్ల మధ్య పందెం నిర్వహిస్తారు. మరికొంత మంది పందెం జరిగే ప్రాంతానికి వెళ్లి అక్కడికక్కడే పందెం కోడిని బరిలోకి దింపి పందెం కాస్తారు. ఇక కోడిపందేలు చూసేందుకు వచ్చిన వారు పై పందాలు కాస్తారు.

జోరుగా పందెం పుంజుల విక్రయాలు..

సంక్రాంతి పండుగ సమీపిస్తున్న క్రమంలో కోడిపందాలకు చాపకిందనీరులా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. పందెం పుంజుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. పందెం బరిలో నిలిచే పుంజుల ధర రూ.10 వేల నుంచి రూ.50వేల వరకు పలుకుతున్నాయి.

జిల్లాలో..

జిల్లాలో రాయచోటి, రైల్వేకోడూరు, రాజంపేట, మదనపల్లె, పీలేరు, తంబళ్లపల్లె ప్రాంతాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో కోడిపందాలు జరుగుతాయి.

రాజభోగమే....



పందెం పుంజులకు పోషకాలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నారు. పోషక ఆహారం కోసం కొంతమంది పందెం రాయుళ్లు రోజుకు మూడు వందల నుంచి ఐదు వందల వరకు కూడా ఖర్చు చేస్తున్నారు. పందెం పుంజులకు ముఖ్యంగా బాదంపప్పు, జీడిపప్పు, నాటు కోడిగుడ్లు, మటన్ కీమా వంటివి పెడుతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పోషకాలుగల ఆహారాన్ని సమయానికి అందిస్తున్నారు. అలాగే మినరల్ వాటర్‌నే తాపుతున్నారు. పందెం కోసం పెంచుతున్న కోళ్లకు ఇస్తున్న ఆహారం, వాటి పట్ల పందెం కాసేవాళ్లు తీసుకుంటున్న జాగ్రత్తలను చూస్తే 'పందెం కోడా మజాకా' అనిపించకతప్పదు.

కోళ్లు.. జాతులు



నెమలి రకం కోడి



పచ్చకాకి రకం కోడి

పందెం కోళ్లలో అనేక జాతులు ఉన్నాయి. కోడి జాతినిబట్టి కూడా డిమాండ్ ఉంటుంది. కాకి, కాకిడేగ, కాకినెమలి, కోడినెమలి, పింగలి, మామిడాకులమైలు, గాజుకోడి, ఎర్రపడ కోడి, సారనెమలి, కల్లికల కోడి, కెక్కిరాయి వంటి రకాలు పందెంకోళ్లలో ఉన్నాయి.

కానీ కోస్తా ప్రాంతంలో జరిగే కోళ్లపందాల కన్నా తక్కువ స్థాయిలో జరుగుతాయని భావిస్తున్నారు. గతంలో గుర్తించిన కోడిపందాల స్థావరాలపైన, కేసులో ఉన్న వారి కదలికలపై నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అయితే ఈ సారి కూటమి నేతల కనుసన్నల్లోనే పల్లె సమీపాల్లోని రహస్య ప్రాంతాల్లో కోడిపందేలు జరుగుతాయని విస్తృత ప్రచారం జరుగుతోంది.

కోడిపందేలకు అడ్డుకట్టవేస్తాం



కోడిపందేల నిర్వహణ చట్టవిరుద్ధం. చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు. జిల్లాలోని మూడు సబ్ డివిజన్ల పరిధిలో కోడిపందేలకు అడ్డుకట్ట వేసే విధంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. బైండోవర్ కేసులు పెడుతున్నాం. స్పెషల్ పార్టీలతో దాడులు నిర్వహించేందుకు సర్వం సిద్ధం చేశాం. – విద్యాసాగర్‌నాయుడు, ఎస్పీ, అన్నమయ్య జిల్లా

తాగునీటి కుళాయి వద్ద మహిళల ఘర్షణ

వ్యక్తిపై కొడవలితో దాడి



ఆస్పత్రిలో బాధితులు గంగిరెడ్డి, కోడలు కవిత

తంబళ్లపల్లె : తాగునీటి కుళాయి వద్ద ఇద్దరు మహిళల మధ్య జరిగిన ఘర్షణ ఓ వ్యక్తిపై కొడవలితో దాడి చేసేందుకు దారితీసింది. ఈ సంఘటన ఆదివారం మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు వివరాలు.. గంగిరెడ్డిపల్లెలో శనివారం హసీనా తాగునీటి కుళాయి వద్ద దుస్తులు ఉతుకుతున్న విషయమై పక్కంటిలోని కవిత ప్రశ్నించింది. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగి దుర్భాషలాడుకున్నారు. కవిత మామ గంగిరెడ్డి కల్పించుకుని హసీనాను మందలించాడు. కోపం పెంచుకున్న హసీనా శనివారం రాత్రి సత్యసాయి జిల్లా నల్లచెరువులోని సోదరులకు జరిగిన ఘర్షణ విషయాన్ని ఫోన్ ద్వారా తెలిపింది. హసీనా సోదరులు కుటుంబ సభ్యులతో ఆదివారం గంగిరెడ్డిపల్లెకు వచ్చారు. వాహనం దిగుతుండగానే గంగిరెడ్డి ఇంటిలోకి చొరబడి కోడలు కవితపై దాడి చేశారు. ఈ క్రమంలో హసీనా గంగిరెడ్డిని నరకమని సోదరులను ప్రేరేపించింది. అక్కడ ఉన్న కొడవలితో గంగిరెడ్డిని విచక్షణారక్షితంగా నరికారు. గంగిరెడ్డి (70) ఎడమకాలికి తీవ్ర గాయమైంది. వారి కేకలు విన్న స్థానికులు సంఘటన స్థలానికి రాగానే హసీనా సోదరులు వాహనంలో పరారయ్యారు. కుటుంబీకులు బాధితులను తంబళ్లపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సమాచారం తెలుసుకున్న హెడ్‌కానిస్టేబుల్ శంకర్ సిబ్బందితో ఆస్పత్రికి వచ్చి జరిగిన సంఘటనపై బాధితులను ఆరా తీశారు. వాహనంలో పరారైన వ్యక్తుల విషయంపై ములకలచెరువు పోలీసులకు సమాచారం అందించడంతో ములకలచెరువు పోలీసులు ఆ వాహనాన్ని అడ్డుకుని అందులోని వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రూ.1.50 లక్షల కేబుల్ వైర్లు చోరీ

చిన్నమండెం : మండలంలోని పడమటికోన గ్రామ పంచాయతీ పసలవాండ్లపల్లెలో శనివారం రాత్రి దాదాపు రూ.1.50 లక్షలు విలువ చేసే కేబుల్ వైర్లను దొంగలు చోరీ చేసినట్లు రైతులు వాపోయారు. వివరాలిలా ఉన్నాయి.. పసలవాండ్లపల్లెకు చెందిన మధుసూధన్‌రెడ్డి గోదావరి పైప్‌తో పొలం దగ్గర మోటారు బిగించి ఉంటే మోటార్‌ను సైతం బయటికి లాగేసి దాదాపు 450 అడుగుల కేబుల్ వైర్‌ను చోరీ చేశారు. మరో రైతు రెడ్డిశేఖర్‌రెడ్డి మోటార్‌ను సైతం బయటికి లాగేసి 500 అడుగుల కేబుల్ వైర్ నుంచి రాగి వైర్లు అక్కడే వేరు చేసుకుని తీసుకెళ్లారు. పోలీసులు దృష్టి సారించి ఈ కేబుల్ వైర్ దొంగల ఆట కట్టించాలని రైతులు కోరుతున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతదేహంతో నిరసన



ఆస్పత్రి ఎదుట శవాన్ని ఉంచి నిరసన తెలుపుతున్న బాధితులు

మదనపల్లె : నిర్లక్ష్యంగా వైద్యం చేసి ప్రాణం తీశారంటూ ప్రైవేట్ ఆస్పత్రి ఎదుట మృతదేహంతో కుటుంబ సభ్యులు నిరసన తెలిపిన ఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. చిత్తూరుజిల్లా పెద్దపంజాణి మండలం నాగిరెడ్డిపల్లెకు చెందిన గుర్రప్ప కుమారుడు ఆర్.వెంకటేష్(60) వ్యవసాయం, ఆవుల వ్యాపారం చేస్తుంటాడు. శుక్రవారం ఛాతీలో నొప్పి రావడంతో పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకున్నారు. గుండె జబ్బుగా నిర్ధారణ కావడంతో వైద్యులు మందులు ఇచ్చి పంపేశారు. శనివారం మళ్లీ నొప్పి ఎక్కువ కావడంతో మరోసారి ఆస్పత్రికి వచ్చాడు. పరిస్థితి విషమంగా ఉండటంతో ఆస్పత్రిలో చేరాడు. వైద్యులు యాంజియోగ్రామ్ చేసి చికిత్స అందించారు. పరిస్థితి బాగానే ఉందని, సమస్య లేదని చెప్పారు. అయితే... ఆదివారం మళ్లీ ఆరోగ్యపరిస్థితి విషమించడంతో మరోసారి శస్త్రచికిత్స నిర్వహించి స్టెంట్ వేశారు. సాయంత్రం 5.30 గంటల సమయంలో వెంకటేష్ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఈ విషయాన్ని అతడితో పాటు ఉన్న అటెండెంట్‌కు తెలియజేసి శవాన్ని తీసుకెళ్లాలని, ఆస్పత్రికి చెల్లించాల్సిన రూ.40వేలు చెల్లించాలని వైద్యులు కోరారు. అంబులెన్స్ తెప్పించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు ఆస్పత్రి వద్దకు చేరుకుని డాక్టర్‌తో మృతుడు వెంకటేష్‌కు అందించిన చికిత్స వివరాలు తెలపాలని అడిగారు. దీనికి వైద్యుడు అంగీకరించకపోవడంతో కుటుంబ సభ్యులు వైద్యసేవలపై అనుమానం వ్యక్తం చేస్తూ, వైద్యుడి వ్యవహారశైలిపై నిరసన తెలుపుతూ, శవాన్ని ఆస్పత్రి ఎదుట పడుకోబెట్టి ఆందోళనకు దిగారు. తమకు న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లేదిలేదంటూ భీష్మించుకున్నారు. ఇంతలో విషయం తెలుసుకున్న టూటౌన్ ఏఎస్ఐ రమణ సిబ్బందితో కలిసి ఆస్పత్రికి వచ్చి వైద్యులను విచారించారు. మృతదేహాన్ని తీసుకెళ్లాల్సిందిగా కుటుంబ సభ్యులకు సూచించి డాక్టర్ వద్ద నుంచి బాధితులు కోరిన చికిత్స వివరాలు అందించేలా చూశారు. వైద్యుడి నిర్లక్ష్యంతోనే తమ కుటుంబ సభ్యుడిని కోల్పోయామని, తమకు న్యాయం జరిగేంతవరకు వెళ్లేది లేదంటూ తెలిపారు. పరిస్థితి మరింత ముదరడంతో టూటౌన్ సీఐ కె.రామచంద్ర, ఎస్ఐ రహీముల్లా ఆస్పత్రి వద్దకు చేరుకుని బాధితులతో మాట్లాడారు. డాక్టర్‌తో చర్చించారు. అనంతరం బాధితులతో..వైద్యచికిత్సపై అనుమానం ఉంటే న్యాయం పొందేందుకు వినియోగదారుల ఫోరం, కలెక్టర్, డీఎంహెచ్‌ఓ, పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయని, ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆందోళన విరమించాల్సిందిగా కోరారు. సీఐ సూచన మేరకు బాధితులు మృతదేహాన్ని అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకెళ్లారు.

టెండర్ పేరుతో భారీ అవినీతి

ఓబులవారిపల్లె : ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఏపీఎండీసీ సిఅండ్‌డి గ్రేడ్ ఖనిజానికి రేటు తగ్గించి టెండర్లు పిలిచి భారీ అవినీతికి పాల్పడ్డారని సీఐటీయూ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ ఆరోపించారు. ఆదివారం మంగంపేట క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం సిఅండ్‌డి గ్రేడ్ రూ. 1680 టన్ను ధర ఉంటే రూ. 1188లకు తగ్గించి 60 లక్షల మెట్రిక్ టన్నులకు టెండర్లు పిలవడం ద్వారా ఏపీఎండీసీకీ దాదాపు రూ. 500 కోట్లు నష్టం వాటిల్లుతుందన్నారు. ప్రపంచ మార్కెట్‌లో మంగంపేట బెరైటీస్‌కు డిమాండ్ ఉండగా ధర తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు. ధరను తగ్గించడం వలన అనేక మంది జీవనాధారం కోల్పోయే అవకాశం ఉందన్నారు. ఏపీఎండీసీపై ఆధారపడి ఉన్న పల్వరైజింగ్ మిల్లులు, కార్మికుల జీవితాలు రోడ్డున పడతాయన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ టెండర్ వేసిన అవినీతి అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్పులు విడుదల చేయాలి

మదనపల్లె సిటీ : పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్పులు, ఫీజు రీయింబర్స్‌మెంటును వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రసన్నకుమార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు అవుతున్నా విద్యారంగ సమస్యలు గాలికి వదిలేశారని ఆరోపించారు. ఆదివారం స్థానిక జీఆర్‌టీ ఉన్నత పాఠశాలలో ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభల్లో భాగంగా రెండో రోజు జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దేశానికి సేవలు చేసిన నేతల గురించి పాఠ్యాంశాల నుంచి తొలగించి దేశానికి ద్రోహం చేసిన వారి గురించి పాఠ్యాంశాల్లో చేర్చడం అన్యాయమన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పరమేష్ మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, ఉపాధ్యక్షుడు రమణ, జేవీకే రాష్ట్ర నాయకుడు హరినాథ్ శర్మ, నాయకులు శ్రీనివాసులు, మదన్‌మోహన్, గిరి, అఫ్రీద్, ప్రశాంత్, గురునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో యువకుడి అరెస్టు

పెద్దతిప్పసముద్రం : మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి మోసం చేసిన కేసులో నిందితుడిని ఆదివారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ కొండయ్య నాయుడు, ఎస్ఐ రవికుమార్ తెలిపారు. బాలిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పట్టెంవాండ్లపల్లి పంచాయతీ బాగేపల్లికి చెందిన ఓ మైనర్ బాలిక సమీపంలోని కందుకూరు జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి చదువుతోంది. కందుకూరు గ్రామానికి చెందిన గుర్రాల నరసింహులు (23) అనే యువకుడు మైనర్ బాలికను ప్రేమ పేరుతో వంచించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 19న బాలికకు మాయమాటలు చెప్పి అపహరించుకెళ్లి బెంగళూరు, చెన్నై లాంటి నగరాల్లో షికార్లు తిప్పాడు. ఈ విషయంపై బాలిక కన్నవాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఏదో విధంగా బాలికను వదిలించుకోవాలని భావించాడు. అనంతరం బాలికను ఊర్లో వదిలి పరారయ్యాడు. జరిగిన ఘటనపై బాలిక పోలీసులకు వివరించింది. డీఎస్పీ పర్యవేక్షణలో మోసపోయిన బాలిక ఫిర్యాదు మేరకు నిందితుడిని మొరుసుపల్లి క్రాస్ రోడ్డు వద్ద అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. నిందితుడిపై ఎస్సీ, ఎస్టీతో పాటు పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ వెల్లడించారు.

వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలి



వడ్డెరల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర సాధికార కమిటీ అధ్యక్షుడు వెంకట్

పెద్దమండ్యం : వడ్డెరలను ఎస్టీ జాబితాలో చేర్చాలని రాష్ట్ర వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు బి.వెంకట్ వడ్డెర డిమాండ్ చేశారు. మండలంలోని బండమీద పల్లె పంచాయతీ తురకపల్లెలో ఆదివారం వడ్డెర సంక్షేమ సహకార సంఘం ఆధ్వర్యంలో వడ్డెరల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర వడ్డెర సాధికార కమిటీ అధ్యక్షుడు మాట్లాడుతూ రాష్ట్రంలో 37 లక్షల మంది వడ్డెరలు ఉండగా ఒక ఎమ్మెల్యే, ఒక ఎంపీ గాని లేక పోవడం చాలా బాధాకరమన్నారు. వడ్డెరలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదగాలంటే ప్రభుత్వం వెంటనే ఎస్టీల జాబితాలో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. జనాభా నిష్పత్తి మేరకు రాష్ట్రంలో ఐదు ఎమ్మెల్యే స్థానాలు, రెండు ఎంపీ స్థానాలను వడ్డెరలకు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సలహాదారు జరిపిటి రెడ్డెప్ప, జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేరంగుల నారాయణ, వడ్డెర సంఘం నాయకులు శంకర, రమణ, క్రిష్ణమూర్తి, రామక్రిష్ణ, సాంబ, శివ, రెడ్డెప్ప, మోహన తదితరులు పాల్గొన్నారు.

పేదోళ్ల రైళ్లను రద్దు చేయడం దారుణం



భరత్‌కుమార్‌రెడ్డి

రాజంపేట : పేదోళ్ల రైళ్లను రద్దు చేయడం దారుణమని, పేద ప్రయాణికుల పట్ల చిన్నచూపు తగదని గుంతకల్ రైల్వే యూజర్స్ కమిటీ సభ్యుడు తల్లెం భరత్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ గుంతకల్–తిరుపతి మార్గంలో ప్యాసింజర్ రైళ్ల రద్దు నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో వెళ్లాలంటే అనుకున్నంతగా జనరల్ బోగీలు అందుబాటులో లేవన్నారు. తిరుపతి–హుబ్లీ ఇంటర్‌సిటీ కడప మీదుగా కర్ణాటక రాష్ట్రం వరకు నడిచే ఏకైక ప్యాసింజర్ అన్నారు. ధర్మవరం లైనులో గుంతకల్ -తిరుపతి, తిరుపతి- కదిరిదేవరపల్లె మధ్య నడిచే ప్యాసింజర్ రైళ్లను రద్దు చేయడంతో ఆ మార్గంలోని చిత్తూరు, సత్యసాయి, అనంతపురం, అన్నమయ్య జిల్లాలకు చెందిన పేద ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ప్యాసింజర్ రైళ్ల రద్దు విషయాన్ని రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

యువగళం పాదయాత్ర హామీలను అమలు చేయాలి



మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు

రాయచోటి అర్బన్ : యువగళం పాదయాత్రలో మంత్రి లోకేష్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని ఏఐఎస్ఎఫ్ కార్యాలయంలో విద్యార్థి, యువజన సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీఎంబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బులను కూటమి ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలన్నారు. కోర్సు పూర్తి సుకున్న విద్యార్థులకు ఆయా యాజమాన్యాలు డబ్బులు చెల్లించలేదన్న కారణంగా సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్, జిల్లా కన్వీనర్ కిరణ్ కుమార్, జిల్లా అధ్యక్షుడు ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

రైతును దూషించిన వ్యక్తితో క్షమాపణ



రైతుబజార్‌లో విచారణ జరుపుతున్న టూటౌన్ ఏఎస్ఐ రమణ

మదనపల్లె : రైతుబజార్‌లో తక్కువ ధరకు ఆకుకూరలు, కాయగూరలు అమ్ముతున్నావంటూ మహిళను దూషించిన ఓ వ్యాపారితో, బాధిత మహిళకు పోలీసులు క్షమాపణ చెప్పించిన ఘటన ఆదివారం జరిగింది. పట్టణంలోని రైతుబజార్‌లో ఆకుకూరలు, కాయగూరలు విక్రయించే ఓ మహిళారైతుతో వారపుసంతలో వ్యాపారం చేసుకునే ఓ వ్యాపారి తక్కువ ధరకు విక్రయిస్తుండటంపై వాగ్వాదానికి దిగాడు. దూషించాడు. దీంతో బాధిత మహిళ మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో ఆయన టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏఎస్ఐ రమణ దూషించిన వ్యక్తిని స్థానిక వారపుసంతలో అదుపులోకి తీసుకుని, రైతుబజార్‌కు తీసుకువచ్చి బాధిత మహిళారైతు సమక్షంలో విచారించారు. చేసిన తప్పునకు వ్యాపారితో మహిళకు క్షమాపణ చెప్పించారు. ఘటన జరిగిన వెంటనే స్పందించి, సమస్య పరిష్కారానికి కృషిచేసినందుకు మార్కెటింగ్ ఏడీ త్యాగరాజు టూటౌన్ పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

చెట్టును ఢీకొన్న కారు

- ఒకరి మృతి
- మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన గంగాధర్



గాయపడిన రెడ్డిరేఖ

మదనపల్లె : కారు అదుపుతప్పి చెట్టును ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన ఆదివారం రాత్రి మదనపల్లె బైపాస్‌రోడ్డులో జరిగింది. పెద్దపంజాణి మండలం దాసార్లపల్లెకు చెందిన వై.గంగాధర్(22), రెడ్డిరేఖ(20) కారులో ఆదివారం రాత్రి ప్రయాణిస్తూ, మదనపల్లె బైపాస్‌రోడ్డులోని రాయల్‌ఉడ్ వద్ద వేగంగా వస్తుండగా, కారు టైరు పగిలింది. దీంతో వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కన ఉన్న చెట్టును ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గంగాధర్ తలకు తీవ్ర గాయమై అధిక రక్తస్రావమైంది. రెడ్డిరేఖ తీవ్రంగా గాయపడింది. ఇద్దరూ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. గమనించిన స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. వైద్యచికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో బాధితులను తిరుపతికి రెఫర్ చేశారు. ఇంతలో గంగాధర్ మృతి చెందాడు. రెడ్డి రేఖను తిరుపతికి తీసుకెళ్లారు. కాగా, బాధితుల వద్ద ఉన్న డ్రైవింగ్ లైసెన్స్ ఆధారంగా కుటుంబీకులకు అవుట్‌పోస్ట్ పోలీసులు సమాచారం అందించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి



మృతి చెందిన లావణ్య

మదనపల్లె : వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మదనపల్లెలో జరిగింది. తమ కుమార్తె మృతికి భర్త, అతని కుటంబ సభ్యులే కారణమంటూ పుట్టింటివారు అనుమానం వ్యక్తం చేశారు. వివరాలు ఇలా.. మదనపల్లె పట్టణం గౌతమినగర్‌లో ఉంటున్న మధుకర్ భార్య లావణ్య(24) రాత్రి బిడ్డకు అన్నం తినిపిస్తూ స్పృహ తప్పడంతో హుటాహుటిన భర్త మధుకర్ ఆటోలో లావణ్యను ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ విషయం తెలుసుకున్న లావణ్య తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని తమ కుమార్తె మృతికి భర్త, అతని కుటుంబ సభ్యులే కారణమంటూ వారితో గొడవకు దిగారు. అవుట్‌పోస్టు పోలీసులు ఆమె మృతిపై అనుమానాలు ఉంటే పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకోవాలని సూచించారు. దీంతోవారు టుటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.